సాక్షి చిత్తూరు

శనివారం । 19 । అక్టోబర్ । 2024



పత్తి గింజల లారీ బోల్తా

గుడిపాల మండలంలోని జాతీయ రహదారిలో పత్తిగింజల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. - 8లో



గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

నగరిలోని హోటళ్లలో అధికారులు తనిఖీ చేసి వారు వాడుతున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. - 8లో



అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని పాలసముద్రం పోలీసులను జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఏపీ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు అపరాద రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.200 అపరాద రుసుంతో ఈ నెల 26 నుంచి 29 వరకు, రూ.500 అపరాద రుసుంతో ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు జిల్లాలోని కో ఆర్డినేటర్ సెంటర్లలో సంప్రదించాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ఫీజులు అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

బంగారుపాళెం: క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని టీబీ యూనిట్‌ను తనిఖీ చేశారు. లాబ్‌ను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా దగ్గు, తరచూ జ్వరం తదితర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్ష చేసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఐసీటీసీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ అఖిల్, జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, టీబీ సూపర్‌వైజర్ శివకుమార్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలోని కార్మికులతో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేషన్ తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న వేతనంపై ఆరా తీశారు. కార్మికులతో మాట్లాడి నెలవారీ పనిదినాలు, జీతభత్యాల గురించి తెలుసుకున్నారు. చెల్లింపుల్లో వ్యత్యాసం ఎందుకు ఉందని అధికారులను ప్రశ్నించారు. దీనిపై జిల్లా స్థాయిలో జరిగే మీటింగ్‌లో చర్చిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ ప్రభావతి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చైర్మన్‌ను కలిసిన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్‌ను స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా శాఖల్లో పారిశుద్ధ్య కార్మికుల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

వైఎస్సార్ కడపలో అగ్నివీర్ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్ఆర్ కడపలోని డీఎస్‌ఏ స్టేడియంలో నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్టు గుంటూరు ఆర్మీ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. అడ్మిట్ కార్డులు పొందిన చిత్తూరు జిల్లా అభ్యర్థులు తప్పనిసరిగా ర్యాలీలో పాల్గొనాలని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, పారదర్శకంగా జరుగుతుందని వెల్లడించారు. మోసగాళ్ల మాటలు నమ్మి ఎవరూ మోసపోకూడదని కోరారు.

పిల్లల్లో అభ్యసన నైపుణ్యాల పెంపునకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని భవితా కేంద్రాల్లోని పిల్లల్లో అభ్యసన నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం చిత్తూరులోని ఎంఈఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాల అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వారిలో ఐదు రకాల అభ్యసన లోపాలుంటాయని, వాటిని ప్రత్యేక శిక్షణలో సరిదిద్దవచ్చన్నారు. అనంతరం ఎంఈఓ కార్యాలయం నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ నరోత్తమరెడ్డి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు పోలయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నాడు పేదలకు ధైర్యం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్ద పీట వేసింది. నాడు–నేడు కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసింది. ఇద్దరు డాక్టర్లతో పాటు సిబ్బంది నియమించి అన్ని రకాల పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంది. అన్ని రకాల మందులు, మాత్రలు సరఫరా చేసి పేదలు ఇబ్బంది పడకుండా చూసింది. ప్రతి పీహెచ్‌సీలోనూ 14 మంది వైద్య బృందం ఉండేలా చేసింది. వైద్యుల దుమ్మాకు చెక్ పెట్టింది. ప్రధానంగా గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల సేవలు అందించింది. దీంతో పీహెచ్‌సీల్లో ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య తగ్గింది. ఈ సేవలను నిత్యం పర్యవేక్షిస్తూ.. వైద్య సేవలు పకడ్బందీగా అందేలా అధికారులతో పర్యవేక్షణ చేయించింది.

నేడు అయోమయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గాడి తప్పాయి. అధికారుల పర్యవేక్షణ లోపించింది. ఫలితంగా వైద్య సేవలు తూతూమంత్రంగా మారాయి. చాలాచోట్ల వైద్యులు ఉండడం లేదు. కొన్నిచోట్ల ఒక డాక్టరు మాత్రమే పనిచేస్తున్నారు. కొంతమంది సిబ్బంది కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు. 24 గంటలు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. మరికొన్ని సాయంత్రానికి తలుపులు వేసుకుంటున్నాయి. రాత్రిపూట సిబ్బంది ఉండడంలేదని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రసవ లక్ష్యాన్ని మరిచిపోయారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. సిబ్బంది కొరత వేధిస్తోంది.

జిల్లాలో పడకేసిన పల్లె వైద్యం..!

సాక్షి పరిశీలన



పలమనేరు ఆస్పత్రిలో అందుబాటులో లేని వైద్యుడు


పీహెచ్‌సీల్లో వైద్యం అందని ద్రాక్షలా మారింది. వైద్యులు సమయానికి విధులకు హాజరు కావడం లేదు. కొంతమంది దుమ్మా కొడుతున్నారు. సిబ్బంది, మందుల కొరత పట్టిపీడిస్తోంది. ఓపీల సంఖ్య తగ్గిపోయింది. కొన్నిచోట్ల వైద్యులు మధ్యాహ్నానికే వెళ్లిపోతున్నారు. తర్వాత ఎవరైనా వస్తే స్టాఫ్ నర్సులు మందులు రాస్తున్నారు. పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, డెంగీ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పేదలు పీహెచ్‌సీలకు వచ్చి వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రులు ఎక్కడా 24 గంటలు పనిచేస్తున్న దాఖలాలు లేవు. పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలపై సాక్షి శుక్రవారం పరిశీలన చేసింది. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగు చూశాయి.

- పీహెచ్‌సీల్లో ఉండని వైద్యులు
- చాలా చోట్ల ఒంటి పూటే వైద్యం
- ప్రైవేట్ ఆస్పత్రులకు పేదల పరుగులు
- పెరుగుతున్న డెంగీ, డయేరియా కేసులు

చిత్తూరు జిల్లా సమాచారం

పీహెచ్‌సీల సంఖ్య	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
50	464
డాక్టర్ల సంఖ్య	ప్రతిపీహెచ్‌సీలో ఉండాల్సిన వైద్య బృంద సంఖ్య
99	14

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఇద్దరు డాక్టర్లు, 12 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలా మంది డాక్టర్లు అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారు. సొంత ప్రాక్టీసులో నిమగ్నమవుతున్నారు. కొంతమంది మధ్యాహ్నానికి వెళ్లిపోతున్నారు. ఓపీలను కూడా కింది స్థాయి సిబ్బందికి అప్పగిస్తున్నారు. తద్వారా రోగులకు అవస్థలు తప్పడం లేదు. వారికి పూర్తిస్థాయి వైద్యం అందడం లేదు. ఈ కారణంగా ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం ఓపీల సంఖ్య 100 కూడా దాటడం కష్టతరమవుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది సైతం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రబలుతున్న వ్యాధులు

ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ, డయేరియా, విష జ్వరాల బారిన పడిన పేదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అక్కడ డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కొన్ని రకాల మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్‌లో కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. రాత్రి పూట గర్భిణులు, క్షతగాత్రులు వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. సుఖ ప్రసవాల లక్ష్యాన్ని అలక్ష్యం చేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలోని పలువురు సిబ్బంది సేవలకు స్వస్తి చెబుతున్నారు. సీజనల్ వ్యాధులపై దృష్టి సారించడంలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

ప్రైవేటు, పెద్దాస్పత్రులకు రెఫర్

డెంగీ, డయేరియా, విష జ్వరాలతో పీహెచ్‌సీలకు వచ్చిన రోగులకు అక్కడ సరైన చికిత్సలు చేయడం లేదు. ఓపీ మాత్రమే చూస్తున్నారు. రోగిని ఇన్‌పేషెంట్‌గా చేర్చుకోకుండా ప్రైవేటు, పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో పేద రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రాలను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దోమల స్వైర విహారం

వాతావరణంలో మార్పులు, వర్షాల వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో జిల్లాలో రోజురోజుకూ డెంగీ, డయేరియా కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో జూలై నుంచి ఇప్పటి వరకు 183 డెంగీ కేసులు, మే నుంచి ఇప్పటి వరకు 689 డయేరియా కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలను బట్టి తెలుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు నగరం, నగరి, పలమనేరు, కుప్పం, తదితర ప్రాంతాల్లో ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. నివేదికల్లో మాత్రం అధికారులు ప్రగతిని చూపిస్తున్నారు. కేసులు వచ్చినప్పుడు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడం, కలుషిత నీటితోనే డెంగీ, డయేరియా ప్రబలుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు. స్థానికంగా వైద్యం అందకపోవడంతో రోగులు చిత్తూరు జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులతోపాటు తిరుపతి రుయాకు పరుగులు తీస్తున్నారు.

ల్యాబ్‌లలో పరీక్షలు తుస్



యాదమరి పీహెచ్‌సీ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రతి పీహెచ్‌సీకి ల్యాబ్ పరికరాలను అందజేసింది. వీటిలో 63 రకాల పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం వీటిలో 20 రకాల పరీక్షలు కూడా చేయడం లేదు. చాలా మంది ల్యాబ్ అసిస్టెంట్‌లు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తూ.. ల్యాబ్ పరీక్షలను గాలికొదిలేస్తున్నారు. మందులు, మాత్రలకే పరిమితం చేస్తున్నారు. ల్యాబ్ పరీక్షలు చేయాలంటే జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తున్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే కొందరు ల్యాబ్ అసిస్టెంట్‌లు ఆస్పత్రులకు దగ్గర్లోనే ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని అక్కడికి రెఫర్ చేయించుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరి. డాక్టర్లు విధిగా డ్యూటీలకు వెళ్లాలి. ఒక డాక్టర్లు ఓపీ చూస్తే, మరో డాక్టర్ గ్రామాలకు వెళ్లాలి. విధులు నిర్వహించక సొంత పనులకు వెళ్లినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేస్తాం. కచ్చితంగా నిర్ణీత సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. 24 గంటలు పనిచేసేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీల వైద్యులపై ఉంది.

–ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్ఓ, చిత్తూరు



యాదమరి పీహెచ్‌సీలో డాక్టర్ లేకపోవడంతో రోగికి చికిత్స అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

నెల	ఓపీల సంఖ్య	జ్వరం కేసులు	డయేరియా కేసులు	డెంగీ కేసులు
జూన్	177291	2554	178	49
జూలై	178366	3381	19	53
ఆగస్టు	183875	3330	312	63
సెప్టెంబర్	184707	3226	85	51
అక్టోబర్	57265	2145	0	16



వీ.కోట మండలం ఓగు పీహెచ్‌సీలో అపరిశుభ్రంగా మారిన ప్రాంగణం

ఐడియా అదిరింది

ఒక ఐడియా జీవితాన్నే మార్చేసింది అనే తరహాలో ఒక టీచర్ ఆలోచన ఆ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దేలా చేసింది. పేద విద్యార్థుల్లో నిజాయితీని పెంపొందింపజేసి సామాజిక సేవ వైపు దూసుకెళ్లేలా మార్గం చూపింది. పాఠశాలలో పచ్చని చెట్లు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పింది. దీనికితోడు గత ప్రభుత్వం నాడు–నేడు కింద తోడ్పాటు అందించడంతో చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీలోని మేకలవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలిచింది.



- పాఠశాలలో నిజాయితీ కార్నర్ ఏర్పాటు
- బందార్ల ఫౌండేషన్ సహకారంతో సమకూరిన సేవలు
- ఉపాధ్యాయుల ఆలోచన.. దాతల తోడ్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న మేకలవారిపల్లె పాఠశాల

చౌడేపల్లె: మండలంలోని మేకలవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు మోహన్‌కుమారి తమ స్కూలును ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. ఆమెకు ప్రధానోపాధ్యాయుడు ఏ.శ్రీనాథరెడ్డి సహకారం అందించారు. ఆమె రొంపిచెర్ల మండలం బందార్లపల్లె, పెద్దమల్లెలకు చెందిన బి.నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి నిర్వహిస్తున్న బందార్ల ఫౌండేషన్‌ను సంప్రదించి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం రూ.25 వేలు విరాళంగా తీసుకున్నారు. తర్వాత ఉపాధ్యాయులందరూ సమావేశమై నిజాయితీగా విద్యార్థులకు సేవలందించి వారిలో సామాజిక చైతన్యం తీసుకురావాలని తీర్మానించారు. పాఠశాలకు సుమారు 15 గ్రామాల నుంచి 122 మంది విద్యార్థులు వస్తున్నారు. వారికి అవసరమైన బోధనా సామగ్రితోపాటు పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, నోట్ పుస్తకాలు, వైట్ పేపర్లు, జామెంటరీ బాక్సులు, స్కేళ్లు తదితరాల కోసం సుమారు 12 కిలోమీటర్ల ప్రయాణించి చౌడేపల్లెకు వెళ్లాలి. లేకుంటే పుంగనూరుకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. వాటిని పాఠశాలలోనే అందుబాటులో ఉంచితే బాగుంటుందని గణిత ఉపాధ్యాయురాలు సూచించారు. వెంటనే బందార్ల ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించి రూ.25 వేల నిధులు సేకరించారు. అందులో నుంచి రూ.7,500లతో బీరువా కొనుగోలు చేశారు. మిగిలిన నగదుతో విద్యా సామగ్రి కొనుగోలు చేశారు. బీరువాకు హానిస్టీకార్నర్‌గా నామకరణం చేశారు. దానికి ఒకరిని ఇన్‌చార్జిగా నియమించారు. పెన్నులు, ఇతర సామగ్రి కావాల్సిన వారు వాటి విలువను కార్నర్ ఇన్‌చార్జి చెల్లించి అవసరమైన వస్తువు తీసుకోవచ్చు. నగదు లేని వారు కూడా తమకు నిజాయితీగా అవసరమైన సామగ్రిని కార్నర్ ఇన్‌చార్జికు తెలిపి వివరాలు నమోదు చేసి నగదు చెల్లించకుండానే వస్తువును తీసుకునే సౌకర్యం కల్పించారు.





నిజాయితీ కార్నర్, లోపల విద్యా సామగ్రి

దాతల సహకారంతో మరిన్ని సేవలు

మదనపల్లెకు చెందిన బీటెక్ విద్యార్థులు ఎల్. వినీల, ఏ.హారిక షన్ సహకారంతో రూ.11 వేలు ఖర్చు చేసి సైన్స్ పరికరాల కార్నర్‌ను ఏర్పాటు చేశారు. అట్లవారిపల్లెకు చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ బీఎన్.రెడ్డి మెడికల్ కిట్‌ను, ఆవుల వారిపల్లెకు చెందిన బాలాజీ బెల్‌ను విరాళంగా సమకూర్చినట్లు హెచ్ఎం శ్రీనాథరెడ్డి తెలిపారు.

పిల్లల్లో చైతన్యం తీసుకురావాలనే..



చిన్నతనం నుంచే విద్యార్థుల్లో నిజాయితీ, సమాజ సేవపై చైతన్యం తీసుకువస్తున్నాం. అంతే గాక ఈ సేవల ద్వారా పేద పిల్లలకు విద్యా సామగ్రి సులభంగా సమకూరుతోంది. సామగ్రి కోసం విద్యార్థులు ఇచ్చే నగదుతో పాటు ఉపాధ్యాయులు కూడా కొంత సమకూరుస్తున్నారు. దాతలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమష్టి కృషితో ముందుకెళ్తున్నాం. – ఏ.శ్రీనాథరెడ్డి, హెచ్ఎం,

బందార్ల ఫౌండేషన్ సహకారంతోనే..



మారుమూల గ్రామమైన మేకలవారిపల్లె పాఠశాలకు ఆర్థిక సాయం అందించాలని బందార్ల ఫౌండేషన్‌ను కోరాం. వారి సహకారంతో తమ కల సాకారమైంది. రూ.25 వేల నిధులతో పేద విద్యార్థులకు సేవలందిస్తూ విద్యా ప్రగతిని సాధిస్తున్నాం. రెండేళ్లుగా కార్నర్‌ను విజయవంతంగా నడుపుతున్నాం.

– మోహన్‌కుమారి, గణిత ఉపాధ్యాయురాలు

చాలా సౌకర్యంగా ఉంది



మా పాఠశాలలో ఉపాధ్యాయులు, దాతల సహకారంతో నిజాయితీ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. మాకు ఏ వస్తువు కావాలన్నా రేటును చెల్లించి తీసుకుంటాం. ఇంతకు మునుపు చౌడేపల్లెకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఖర్చులు కూడా ఎక్కువ అయ్యేవి. ఇప్పుడు మా స్కూల్‌లోనే లభిస్తున్నాయి. చాలా సౌకర్యంగా ఉంది.

– వై.స్రవంతి, 8వ తరగతి విద్యార్థిని

పాతకలెక్టర్ కార్యాలయం పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత కలెక్టర్ కార్యాలయంలో ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆ భవనాన్ని శుక్రవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ పరిశీలించారు. గదులకు దాదాపు రూ.5 లక్షలతో మరమ్మతులు చేసి డివిజన్ కార్యాలయానికి తగినట్టు గదులను మార్పు చేసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ అధికారులను కలిసి చర్చించారు. వారు భవనాన్ని ఇవ్వడానికి అంగీకరించడంతో త్వరలోనే విద్యుత్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఆదేశాలు ఇవ్వనున్నట్టు ఎస్ఈలు తెలిపారు. శిథిలావస్థకు చేరుకుని ఈఆర్వో కార్యాలయం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం జిల్లా స్టోర్స్‌ను పరిశీలించారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, అమర్‌బాబు, డీఈలు శేషాద్రి, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్ర శిక్ష శాఖ పరిధిలోని ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శనివారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ ఇంగ్లీష్ 2, సీఆర్‌టీ ఫిజిక్స్ 1, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ 5, పీజీటీ సివిక్స్ 1, పీజీటీ కామర్స్ 1, వార్డెన్ 2, అకౌంటెంట్ 1 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. వీటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సందేశాలు పంపినట్లు చెప్పారు. సందేశాలు అందిన వారు వెరిఫికేషన్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. ఆమె శుక్రవారం చిత్తూరు నగరంలోని మురకంబట్టు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో చేపట్టిన ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామచంద్రారెడ్డి, రామకృష్ణ, నారాయణ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలకు 78 మంది హాజరు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం వినికిడి లోపం ఉన్న వారి కోసం స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఇందులో 78 మంది పాల్గొనగా ఈఎన్‌టీ విభాగం, డీఈఐసీ సెంటర్ వైద్యులు పరీక్షలు చేశారు. వినికిడి లోపం ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి వినికిడి పరికరాలు అందజేస్తామని ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శిరీష తెలిపారు.

రెండు పాడి ఆవుల అపహరణ

పలమనేరు: మండలంలోని మొసలిమొడుగుకు చెందిన కృష్ణమూర్తి నాయుడు రెండు పాడి ఆవులను గురువారం రాత్రి దుండగులు అపహరించారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గమనించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కృష్ణమూర్తినాయుడు గ్రామ సమీపంలోని పొలాల వద్ద నివాసముంటూ పశువులను మేపుకుంటున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఆవులను అపహరించారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

దారికాచిన మృత్యువు!

పెద్దకన్నలి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదస్థలాన్ని చూపబోయి అనంతలోకాలకు చేరిన ఫారెస్ట్ వాచర్
- శ్రీకాళహస్తి–నాయుడుపేట మార్గంలో ఘటన



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎఫ్‌ఓ వివేక్



వెంకటేష్ మృతదేహం, వెంకటేష్(ఫైల్)

రేణిగుంట: 'విధి ఎంత బలీయమైనదో' ఈ ఘటన ఓ తార్కాణం. తనకు ఏ మాత్రం సంబంధం లేని ఒక ఘటనలో రక్షకభటులకు సహాయకారిగా వెళ్లి అక్కడ చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ చిరుద్యోగి అలంతలోకాలకు చేరిపోయాడు. అయినవాళ్లకు తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం, పెద్దన్నకలి ఎస్టీ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ వెంకటేశు తెలిపిన వివరాలు.. గురువారం అర్ధరాత్రి 12.30 గంటల సమయం.. శ్రీకాళహస్తి–నాయుడుపేట మార్గం, పెద్దకన్నలి ఎస్టీ కాలనీ సమీపంలో కేరళ నుంచి ఒడిశా వెళుతున్న టూరిస్ట్ బస్సు, కట్టెల లోడ్డుతో శ్రీకాళహస్తి వైపు వస్తున్న ఓ ట్రాక్టర్ ఢీకొన్నాయి. బసవయ్యపాళెం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ వాచర్ బీ.వెంకటేష్(32)కు సమాచారం వచ్చింది. ఆయన టూటౌన్ సమీపంలోనే ఉన్న హైవే మొబైల్ పోలీసులకు తెలిపాడు. ప్రమాద స్థలాన్ని చూపించాలని హైవే మొబైల్ పోలీసు సిబ్బంది అనిల్, సుబ్రమణ్యం అతనిని కోరడంతో, వారితోపాటు పోలీసు సుమోలో పెద్ద కన్నలి ఎస్టీ కాలనీలోని ప్రమాద స్థలానికి వెళ్లారు. అక్కడ పోలీసులిద్దరూ సుమో దిగి ఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా వాచర్ వెంకటేష్ సుమోలోనే కూర్చుని ఉన్నాడు. వారు కిందకు దిగిన కొద్ది క్షణాల వ్యవధిలో శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న ఓ ఈచర్ వాహనం అతివేగంగా వచ్చి పోలీసు సుమోను ఢీకొంది. దీంతో సుమో దూసుకెళ్లి కట్టెల లోడ్డులో ఇరుక్కుంది. ఫారెస్ట్ వాచర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసు సిబ్బంది అనిల్, సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ పేర్కొన్నారు.

కిందకి దిగి ఉంటే మృత్యువు తప్పేదేమో!

తొట్టంబేడు మండలం, బసవయ్యపాళెం ఎస్టీ కాలనీకి చెందిన బీ.వెంకటేష్‌కు భార్య పద్మజ, పిల్లలు బీ.చెంచమ్మ(08), బీ.మోహిత్(04) ఉన్నారు. పదేళ్లుగా ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యథావిధిగా గురువారం రాత్రి బసవయ్యపాళెం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా, పోలీసు సిబ్బంది తమ వెంట తీసుకెళ్లారు. అయితే పోలీసు సిబ్బందితోపాటు వెంకటేష్ కూడా సుమో దిగి ఉంటే మృత్యుగండం తప్పేది. కానీ సుమోలోనే కూర్చుని అనూహ్య ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. కటిక పేదరికాన్ని జయించి చిరుద్యోగం సంపాదించి భార్య, పిల్లలతో అన్యోన్యంగా జీవితాన్ని గడుపుతున్న వెంకటేష్ లేడన్న చేదువార్త విని అతని భార్య పద్మజ, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

నివాళి అర్పించిన డీఎఫ్‌ఓ

రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ వాచర్ వెంకటేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న డీఎఫ్‌ఓ పీ.వివేక్, ఎఫ్‌ఆర్‌ఓ లోకేష్ బసవయ్యపాళెం ఎస్టీ కాలనీకి చేరుకుని అతని మృతదేహంపై త్రివర్ణ పతాకాన్ని కప్పి ఘన నివాళి అర్పించారు. మృతుని భార్య పద్మజ, పిల్లలను ఓదార్చారు. మృతుని భార్యకు కారుణ్య నియామకాల్లో ఉద్యోగం ఇప్పించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామ ఆచారం
ఊరి బయటే మృతదేహం

ఊరి బయట మరణిస్తే మృతదేహాన్ని ఊళ్లోకి తీసుకురాకుండా గ్రామ శివారునే ఉంచి అక్కడి నుంచే అంతిమ సంస్కారాలు చేయాల్సిన మూఢాచారం నేటికీ చాలా గ్రామాల్లో ఉంది. ఈ కోవలోనే వెంకటేష్ ఊరి బయట మృతి చెందడంతో గ్రామ ఆచారం ప్రకారం ఆయన మృతదేహాన్ని బసవయ్యపాళెం ఎస్టీ కాలనీ శివారున ఓ షామియానా కింద ఉంచారు. మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని గుండెలు బాదుకుంటూ రోదించారు. మృతుని పిల్లలు చెంచమ్మ, మోహిత్ తండ్రి మృతదేహాన్ని దీనంగా చూస్తూ ఉండిపోయారు. లేయ్ నాన్నా.. మమ్మల్ని ఒకసారి చూడు... అంటూ తండ్రి మృతదేహం వద్ద కన్నపేగులు అలమటిస్తున్న తీరు అక్కడి వారి కంటతడి పెట్టించింది.

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

నగరి : హోటళ్లలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పోలీసు ఇన్‌స్పెక్టర్లు కే.వెంకటరవి, ఎస్.చంద్రశేఖర్, స్థానిక రెవెన్యూ అధికారులు డీటీ కె.మేఘవర్ణం, వీఆర్‌వో ఎం.కేశవులు బృందంగా ఏర్పడి శుక్రవారం నగరిలోని పలుచోట్ల తనిఖీలు చేశారు. తిరుత్తణి రోడ్డులో ఉన్న హనీఫా హోటల్, సుదర్శన్ స్వీట్స్, జబ్బార్ హోటల్, ఆర్‌ఆర్ హోటల్, మాషా అల్లా బిర్యానీ సెంటర్, విరాట్ టీ స్టాల్‌లో వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. యజమానులపై కేసులు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ వ్యాపారాలు చేసుకునే వారు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు కాకుండా కమర్షియల్ సిలిండర్లను వినియోగించాలన్నారు. లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్



నిందితులు, వాహనాలను చూపుతున్న పోలీసు అధికారులు

శాంతిపురం: కుప్పం పోలీస్ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కుప్పం ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు సీఐ మల్లేష్ యాదవ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టామని వెల్లడించారు. రాళ్లబూదుగూరు, గుడుపల్లి ఎస్‌ఐలు నరేష్, శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వారు కడపల్లి పంచాయతీ కదిరిఓబనపల్లికి చెందిన వి.మధు, ఎస్.నవీన్, ఎల్.నందీష్‌గా గుర్తించామన్నారు. వారి నుంచి 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు ప్రవీణ్ కుమార్ అరెస్టు చూపుతున్న సీఐ సూర్యనారాయణ

రొంపిచెర్ల: మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కల్లూరు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లెకు చెందిన రోజా(30), ప్రవీణ్‌కుమార్(21) బంధువులు. ప్రవీణ్‌కుమార్ మూడు రోజులుగా కూలి పనికి పోకుండా ఉండడంతో ఆమె మందలించింది. దీన్ని అవమానంగా తీసుకున్న ప్రవీణ్‌కుమార్ ఆమెపై బీరు సీసాలతో దాడి చేశాడు. సీసా ముక్క తీసుకుని కాళ్లు, చేతులు, గొంతు మీద కోశాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి ఆమెను రక్షించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ప్రవీణ్ కుమార్‌ను గురువారం అరెస్టు చేశారు. అనంతరం పీలేరు కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

- జీవాలకు ఏటా నట్టల నివారణ మందు తాగించాలి
- పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్



గొర్రెలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ ప్రభాకర్

తవణంపల్లె : గొర్రెలు, మేకల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం కె.పట్నంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మూగజీవాలకు నట్టల నివారణ మందు తప్పక తాగించాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ రైతులు సామూహికంగా జీవాలకు నట్టల నివారణ మందు తాగించడం వల్ల రోగాలను నియంత్రించవచ్చని తెలిపారు. మండలంలో 4,372 గొర్రెలు, 3,663 మేకలు, 18,513 పశువులు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ముందుకు వచ్చి సామూహికంగా నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు. మండలంలోని జొన్నగురకల, దిగువమాఘం, తెల్లగుండ్లపల్లె, మత్యం, గాజులపల్లె, ద్వారకాపురం గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు.

బీసీల జీవన ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని బీసీ సామాజిక వర్గం, ఉపకులాలకు చెందిన వ్యక్తుల జీవన ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. ఆమె శుక్రవారం బీసీ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బీసీ, ఉపకులాలకు చెందిన వారు జిల్లాలో వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. వారి సమస్యల పరిష్కారంతోపాటు జీవన ప్రమాణాల పెంపునకు చేపట్టాల్సిన పథకాలపై సూచనలు సేకరిస్తున్నట్టు చెప్పారు. సంచార, పాక్షిక సంచార, డీ నోటిఫైడ్స్ వారికి సీడ్ పథకంలో ఇళ్లు, ఆరోగ్య బీమా, స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. చదువుకున్న పిల్లలకు పోటీ పరీక్షల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సంఘం నాయకులతో సేకరించిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

వరి పంటపై అడవి పందుల దాడి

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెకు చెందిన రైతుల పంటలపై గురువారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. రైతు క్రిష్ణమూర్తి సాగు చేసిన రెండు ఎకరాల వరి పంటను తొక్కి, తిని ధ్వంసం చేశాయి. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. అడవి పందుల దాడితో సుమారు రూ.50 వేలు నష్టం వాటిలినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం రాయితీపై సోలార్ కంచెలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు కాణిపాకం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

ఐరాల: రాష్ట్ర స్థాయి పోటీలకు కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అండర్–17 బాలికల విభాగంలో విద్యార్థిని నీలిమ ఎంపికైందని, ఈమె నెల్లూరులో నవంబర్ 3 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. అలాగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అండర్–17 విభాగంలో యువశ్రీ ఎంపికైందని, అండర్–14 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు దేవీప్రియ, ఢిల్లీబాబు, జాన్‌లుక్ ఎంపికైనట్లు తెలిపారు. వీరందరూ ఈ నెల నంద్యాలలో నిర్వహించనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థులను పీడీలు నాగరాజు, మహరాణి, ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్, ఉపాధ్యాయులు అభినందించారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

చౌడేపల్లె : మండలంలోని కాటిపేరి పంచాయతీ వడ్డివారిపల్లె సమీపంలో ఉన్న కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. భక్తులు శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా గేటు తాళాలు ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. దుండగులు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి నగదు, విలువైన వెండి వస్తువులను చోరీ చేసినట్టు గుర్తించారు. హుండీలో సుమారు రూ.15 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మారెమ్మ ఆలయంలో..

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగు సమీపంలోని పలమనేరు–గుడియాత్తం రోడ్డు పక్కనున్న మారెమ్మ ఆలయంలోని హుండీని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు రూ.20 వేల నగదు, అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని దుండగులు చోరీ చేసినట్టు గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఈ ప్రాంతంలోని పలు ఆలయాల్లో చోరీలు జరిగినట్టు వారు పేర్కొన్నారు.

గర్భం దాల్చిన బాలిక

శాంతిపురం: రాళ్లబూదుగూరు పంచాయతీలోని శెట్టిగానికురుబూరుకు చెందిన బాలిక(13) గర్భం దాల్చింది. దీనిపై బాలిక తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలిక స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కొంత కాలంగా కొడుపునొప్పితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు కుప్పంలోని ఒక చిన్న పిల్లల ఆస్పత్రిలో చూపించారు. పరీక్షించిన వైద్యులు ఆమె 8 నెలల గర్భవతిగా నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన వెంకటాచలం అనే యువకుడి కారణంగా తాను గర్భం దాల్చినట్టు బాలిక తెలపడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన రాళ్లబూదుగూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అదుపుతప్పి పత్తిగింజల లారీ బోల్తా

గుడిపాల: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో మద్రాస్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం పత్తిగింజల లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. లారీ పత్తిగింజలు తీసుకుని గుంటూరు నుంచి తమిళనాడు రాష్ట్రం సేలం వెళుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని మద్రాస్ క్రాస్ రోడ్డు వద్దకు చేరుకుంది. అక్కడ డ్రైవర్ లారీని వేలూరు వైపు తిప్పాడు. దీంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ ఒక్కడే ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు వచ్చి ఉంటే భారీ ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతి గృహాల్లో వసతులు కరువు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా కేంద్రమైన చిత్తూరు సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో వసతులు కరువయ్యాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు చలికి వణుకుతున్నారని తెలిపారు. పరిశుభ్రత లేదని, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గదుల్లోని కనీసం కిటికీలకు రెక్కలు కూడా లేవన్నారు. దుప్పట్లు, చాపలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని చెప్పుకొచ్చారు. సరైన భోజనం లేక విద్యార్థులు వెక్కిళ్లు పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ మణికంత చందోలు
- ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంపై ఆగ్రహం



నేలలో దిగబడిపోయిన టిప్పర్

పాలసముద్రం : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ మణికంత చందోలు ఆదేశించారు. ఆయన శుక్రవారం పాలసముద్రం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి తమిళనాడుకు ఇసుక రవాణా అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. అలాగే నాటుసారా తయారు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెట్టాలని, ఇక్కడి నుంచి తమిళనాడుకి ఇసుక రవాణా అవుతున్నట్టు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాటుసారా తయారీని అరికట్టాలన్నారు. అనంతరం పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఎస్పీ కార్యాలయానికి కనెక్షన్ ఉందా లేదా తనిఖీ చేశారు.

ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు

పాలసముద్రం మండలం సింహరాజుపురం నుంచి తమిళనాడుకు అక్రమంగా టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ భారతి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నీవా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి సింహరాజుపురం చెరువు సమీపంలో డంప్ చేస్తున్నారని తెలిపారు. గురువారం రాత్రి జేసీబీతో టిప్పర్‌కు లోడ్‌చేసి ఇసుక తరలించారని తెలిపారు. తుపాను ప్రభావంతో వర్షం కురుస్తుండడంతో టిప్పర్ నేలలో దిగబడిపోయిందని తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుకను సీజ్ చేసినట్టు తెలిపారు. తమినాడుకు చెందిన టిప్పర్ యజమాని రాజు, ఇసుక తరలించేందుకు సహాయ పడిన సింహరాజుపురం దళితవాడకు చెందిన మునీ, ఎల్లప్పన్, శరవణన్‌పై కేసు నమోదు చేసినట్టు వివరించారు.

